


## నేడు గ్రూప్స్, డివైఇఐ పరీక్షలకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ

గ్రూప్స్, డివైఇఐ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని యుటిఎఫ్ ఆడిట్ కమిటీ జిల్లా కన్వీనర్ ఐ.ప్రసాదరావు శనివారం ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 4 ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఈ సదస్సు జరుగుతుందన్నారు. పోటీ పరీక్షల శిక్షణ నిపుణులు ఎంఎస్‌ కె.ఎస్.లక్ష్మణరావు సారధ్యంలో పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు(బచి) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సదస్సులో ఉచితంగా మెటీరియల్ అందిస్తామన్నారు. ఆశావహులు, ఆశక్తి ఉన్న వారు హాజరు కావాలని, మెలకువలు నేర్చుకుని భవిష్యత్తులో ఉద్యోగాలు పొందాలని ఆయన కోరారు.

# ద(మె)గా డిఎస్‌సి..!!

- అరకొరగా డిఎస్‌సి పోస్టుల భర్తీ
- నిరాశలో నిరుద్యోగులు
- కంటితుడుపు చర్యలే అంటున్న యువత



ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న నిరుద్యోగులు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

అధికారంలోకి రాకముందు ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి యువత ఉపాధి కోసం అనేక హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పుకొచ్చారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డిఎస్‌సిని ప్రకటించి భర్తీ చేస్తామని ప్రకటనలు గుప్పించారు. తీరా ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన జగన్ సచివాలయ ఉద్యోగాల మినహా ప్రభుత్వ శాఖల్లో ఒక్క ఉద్యోగం ఇచ్చిన పాపానపోలేదు. ఎన్నికలకు ముందు డిఎస్‌సి అంటూ ప్రకటన ఇచ్చి మరోసారి ఆశలు రేపారు. తీరా ప్రకటించిన డిఎస్‌సిలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో కోతలు పెట్టడం నిరుద్యోగులను తీవ్ర నిరాశలోకి నెట్టారు.

**మెగా దగా**

ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే 23 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తానని జగన్ హామీ ఇచ్చారు. తీరా సీఎం అయ్యాక ఆ హామీనే మరిచారు. అధికార పగ్గాలు చేపట్టి ఐదేళ్లు పూర్తికావస్తున్న తరుణంలో మరోసారి నిరుద్యోగులను ఓట్లను కొల్లగొట్టుకునేందుకు 6,100 పోస్టులతో భర్తీ డిఎస్‌సిని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిఎస్‌సి పేరుతో తమను మరోసారి దగా చేస్తున్నారని మండిపడుతున్నారు. రాష్ట్రంలో 21 వేలు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 2 వేల టీచర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. అయితే జగన్ సర్కార్ రాష్ట్రవ్యాప్తంగా కేవలం 6,100 టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు మెగా అనిపించేలా కేబినెట్‌లో నిర్ణయించారు. ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎస్‌ఎ మొదటి లాంగ్వేజ్ 44, సెకండ్ లాంగ్వేజ్ 7, ఎస్‌ఎ ఇంగ్లీష్ 38, ఎస్‌ఎ మాత్స్ 15, ఎస్‌ఎ పిఎస్ 4, ఎస్‌ఎ బిఎస్ 15, ఎస్‌ఎ ఎస్‌ఎస్ 12, ఎస్‌ఎ పిఇ 102 మొత్తంగా 237 పోస్టులను ఈ డిఎస్‌సి ద్వారా భర్తీ చేయనున్నారు. మెగా డిఎస్‌సి అంటూ ఐదేళ్లుగా నిరుద్యోగులను ఊరిస్తూ వచ్చిన ప్రభుత్వం జిల్లాలో కేవలం తక్కువ పోస్టులను మాత్రమే భర్తీ చేస్తున్నట్లు ప్రకటించి ఉసూరుమనిపించింది. గడిచిన ఐదేళ్లలో ఒక్క డిఎస్‌సి కూడా నిర్వహించకపోవడంతో కనీసం ఎన్నికల ముందైనా 20 వేల పోస్టులను భర్తీ చేస్తుందని నిరుద్యోగులు ఆశించారు. జిల్లాలో కనీసం 1500 పైనే పోస్టులు భర్తీ అవుతాయని భావించారు. అయితే డిఎస్‌సి అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏటా 6 వేల ఖాళీలు భర్తీ చేస్తామని ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన జగన్ ఐదేళ్లకు కలిపి 6,100 పోస్టులు భర్తీ చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. వేలమంది నిరుద్యోగులు డిఎస్‌సిపై ఆశలు పెట్టుకుని రూ.వేలల్లో డబ్బులు ఖర్చు చేస్తూ కోచింగ్‌లు తీసుకుంటున్నారు. కానీ ఆశకున్న స్థాయిలో డిఎస్‌సి ప్రకటించకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశను వ్యక్తం చేస్తున్నారు.

### తక్షణమే మెగా డిఎస్‌సిని ప్రకటించాలి



అదిగో, ఇదిగో మెగా డిఎస్‌సి అంటూ ఊరించి నాలుగున్నరేళ్ల తర్వాత నిరుద్యోగుల చెవిలో పువ్వులు పెట్టిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కింది. రాష్ట్రంలో సుమారు 40 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 6,100 పోస్టులు మాత్రమే ప్రకటించారు. ప్రతి జిల్లాలో 1600 టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే జగన్ ప్రభుత్వం జిల్లాకి 237 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తుంది. డిఎస్‌సి పోస్టుల సంఖ్యను పెంచాలని డివైఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నాం.

–పీడీ. ప్రసాద్, జిల్లా కో-కన్వీనర్ డివైఎఫ్ఐ కాకినాడ జిల్లా.

### ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి



గత 5 ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కాకపోవడంతో ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగిపోతున్నాయి. విద్యను ప్రపంచ స్థాయికి తీసుకుని వెళ్తున్నామని చెపుతూనే మరో పక్క ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేయకపోవడం శోచనీయం. తక్షణమే ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలి. అప్పుడే విద్యార్థులకు నాణ్యత కలిగిన విద్య అందుతుంది.

–ఎం.గంగాసూరిబాబు, కార్యదర్శి, ఎస్‌ఎఫ్ఐ, కాకినాడ జిల్లా.

### నిరుద్యోగుల ఆశలు ఆవిరి



ఎంతో ఆత్రుతగా ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నా మా ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది. 2015లో బిఈడి పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాను. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు ఎక్కువైపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఈ సారైనా ఉద్యోగం వస్తుందేమోనని ఆశగా ఎదురు చూశాం.కానీ ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయకపోవడం బాధాకరం.

– కె.శేఖర్, డిఎస్‌సి అభ్యర్థి, కాకినాడ



నిరసన ప్రదర్శన చేస్తున్న జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్

## కొనసాగుతున్న శానిటేషన్ వర్కర్స్ ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్స్(సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన 4వ రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సిహెచ్. విజయ్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు సేవలు అందించడంలో జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. తాము సమ్మె చేస్తే ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యజమానులు చెల్లించాల్సిన పిఎఫ్ వాటాను కార్మికుల జీతాల నుంచే చెల్లించడం దారుణ మన్నారు. ఇదే అంశాన్ని అధికారులకు, కాంట్రాక్టు సంస్థకు పలు దఫాలుగా విన్నవించినా ఫలితం లేకపోవడంతోనే ఆందోళన చేపట్టాల్సివచ్చిందన్నారు. సోమవారం నుంచి తమ ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామన్నారు. యూనియన్ మహిళా నేత జె. లక్ష్మీప్రియ మాట్లాడుతూ బియ్యం, నూనె, పప్పుదినుసులు వంటి నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. తమకు వచ్చే జీతం కుటుంబ ఖర్చులకు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. జీతాలు పెంచాలని, తమ జీతం నుంచి అదనంగా కత్తిరిస్తున్న పిఎఫ్ సొమ్ము తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ జిజిహెచ్ అత్యంత కీలకమైన విభాగం శానిటేషన్ అని అన్నారు. వైద్యులు, నర్సులు ఇతర పారామెడికల్ సిబ్బంది కంటే ముందుగా ఆసుపత్రిలో ఏ విభాగంలోనైనా శానిటేషన్ వర్కర్ అడుగు పెట్టాలన్నారు. కానీ జీతాలు, సౌకర్యాలు విషయంలో చివరలో ఉంటున్నారని తెలిపారు. కార్మికులు సమ్మె చేయాల్సి వస్తే జరగబోయే పరిణామాలకు అధికారులే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.వాసు, కృష్ణవేణి, చంద్రకళ, రమణమ్మ, పుష్ప, తలుపులమ్మ, భాగ్యలక్ష్మి, బి.శ్రీకాంత్, ఎం.యేసు, ఎం.రవి, వసంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో హెల్త్ అసిస్టెంట్ మృతి



ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజారోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్‌గా అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న పొడుగు చిట్టిబాబు శనివారం సాయంత్రం గుండె పోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. శనివారం మధ్యాహ్నం వరకూ విధుల్లో ఆయన 3 గంటల సమయంలో ఇంటికి వెళ్లి భోజనం చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే కుటుంబీకులు స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చిట్టిబాబు గతంలో 4వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున కౌన్సిలర్‌గా పదవిని నిర్వర్తించారు. తదుపరి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఈయన అకాల మృతికి మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, ఇన్‌ఛార్జ్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ పిచ్చుక శ్రీనివాసరావు, సిబ్బంది, దిగ్భ్రాంతికి గురయ్యారు. చిట్టిబాబు మృతికి పలువురు కౌన్సిలర్లు సంతాపం తెలిపారు.

## నేడు రాష్ట్రస్థాయి యడ్ల పరుగు ప్రదర్శన

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట - ఉండురు ఎన్‌ఎఫ్ సిఎల్ రోడ్డులో నేడు రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు శ్రీకుమార రామ భీమేశ్వర ఎడ్ల పరుగు ప్రదర్శన కమిటీ నాయకులు తెలిపారు. ఎడ్ల పరుగు జరిగే ప్రదేశంలో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రదర్శనను కాకినాడకు చెందిన చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ అధినేత గుణ్ణం చంద్రమౌళి ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 సీనియర్ ఎడ్ల జతలు సుమారు 40 జూనియర్ ఎడ్ల జాతులు ఈ ప్రదర్శనలో పాల్గొనున్నట్లు చెప్పారు సీనియర్ ఎడ్లు 1500 మీటర్లు, జూనియర్ ఎడ్లు 1000 మీటర్లు వెళ్లి రావాల్సి ఉంటుందన్నారు. విజేతలైన ఎడ్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు, షీల్డ్‌లు అందించడం జరుగు తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు బిక్కిన రంగా, పైన్ని చిట్టియ్య, కాటూరి జానకి రామ్, కొండపల్లి శ్రీను, రామకృష్ణ, పైన్ని గౌరీ చంద్, జి.శివ, రైతులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న కమిటీ నాయకులు

## ఓటమి భయంతోనే ఓట్ల తొలగింపు

ప్రజాశక్తి - కాకినాడ

రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతోనే టిడిపి సానుభూతిపరుల ఓట్లు తొలిగింపునకు ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కుట్రలు పన్నుతున్నారని మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు విమర్శంచారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లా డారు. కాకినాడ వైసిపి కార్యాలయం కేంద్రంగానే టిడిపి సానుభూతిపరుల ఓట్లు తొలగింపు కోసం బల్క్‌గా ఫారం 7 దరఖాస్తు చేస్తున్నారని అన్నారు. ఓటర్ లిస్ట్ అవకతవకలపై గతంలో పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. కాకినాడ నగరంలో నమోదు కాపాడుతున్న దొంగ ఓట్లు, టిడిపి సానుభూతి పరులు ఓట్లు తొలగింపుకై బల్క్‌గా నమోదు కాబడుతున్న ఫారం - 7 లపై రాష్ట్ర, కేంద్ర ఎన్నికల కమిషన్‌కి ఫిర్యాదు చేశామన్నారు. దీనిఫలితంగానే జిల్లా అధికారులు కాకినాడలో 22 ఎఫ్ఐఆర్‌లు వేసి 130 మందిపై కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ద్వారంపూడిని నమ్ముకున్న వారు ఎవరైనా జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో టిడిపి నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, నాయకులు తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, సయ్యద్ అలీ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొండబాబు

## ఎస్‌సిలపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు(పిఠాపురం)

మండల పరిధిలో చిన్న జగ్గంపేటలో ఎస్‌సిలపై దాడి చేసిన వారిని చట్ట ప్రకారం శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.సింహాచలం డిమాండ్ చేశారు. శనివారం కెవిపిఎస్ నాయకులు బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ గ్రామానికి చెందిన యువకుడు(17) ఓ రైతు వద్ద పాలికాపు పనికి చేరాడని, అడ్వాన్స్‌గా కొంత సొమ్ము రైతు యువకుడి కుటుంబానికి ఇచ్చాడన్నారు. రైతు అల్లుడు కొట్టడంతో యువకుడు పనిలోకి వెళ్లడం మనేశాడని తెలిపారు. శుక్రవారం అడ్వాన్స్ సొమ్ము కోసం రైతు దళిత యువకుడి ఇంటికి వచ్చి గొడవ చేసి ఇంటి దగ్గర ఉన్న పాడి గేదెను తోలుకుని వెళ్ళిపోయారని తెలిపారు. కొంత సమయం ఇస్తే అడ్వాన్సు సొమ్ము తిరిగి చెల్లిస్తామని దళిత కుటుంబం ఎంతగా ప్రాధేయపడిన అంగీకరించలేదన్నారు. దళిత కుటుంబ సభ్యులు, వారి బంధువులు గ్రామంలో యువకులు అడ్వాన్సు సొమ్ము తీసుకుని రైతు ఇంటికి వెళ్ళగా డబ్బులు తీసుకోవడానికి నిరాకరించారని, అదే సమయంలో తమకే ఎదురు సమాధానం చెబుతారా అంటూ గ్రామ సర్పంచి కులం పేరుతో దూషించి అవమానపరిచారన్నారు. యువకుడి వెంట వెళ్ళిన మహిళల పట్ల, దళిత బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాక అడ్డు వచ్చిన యువకులను మహిళలను పిడుగులు గుద్దాన్నారు. పెత్తందారులు దాడి చేయడంతో దళితులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారన్నారు. దళితులపై దాడి చేసిన పెత్తందారుల పై ప్రభుత్వం చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో కెవిపిఎస్ నాయకులు ఎంజె.ఫెడ్రిక్, నాసా ఫౌండేషన్ నాయకురాలు లక్ష్మి పాల్గొన్నారు.


దాడి ఘటనపై వివరాలను తెలుసుకుంటున్న కెవిపిఎస్ నాయకులు

## ఇంటింటికీ సిపిఎం ప్రజా నిధి సేకరణ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ప్రజలపక్షాన నిరంతరం పోరాడుతున్న సిపిఎం ఇంటింటికి ప్రజానిధి సేకరణ కార్యక్రమాన్ని చేపట్టిందని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అన్నారు. మండలంలోని తూరంగి గ్రామంలో శనివారం ఇంటింటికి ప్రజానిధి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఇంటింటికి ప్రజానిధి సేకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతపల్లి అజయ్ కుమార్, కె.వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, టి.రాజా, డి.ఆదర్శ, యుఎస్‌ఎన్.రెడ్డి, టి. సుబ్బారావు పాల్గొన్నారు.



విరాళాలలను సేకరిస్తున్న సిపిఎం నాయకులు

## జర్నలిస్టుల స్థలాల ప్రక్రియను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

జర్నలిస్ట్‌లకు ఇళ్ల స్థలాలు ఇచ్చే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కోర్టు హాల్లో జర్నలిస్ట్‌లకు ఇళ్ల స్థలాల పంపిణీ పథకం అమలుపై ఏర్పాటైన జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శనివారం జరిగింది. జిల్లాలో అక్రిడిటెడ్ జర్నలిస్ట్‌ల నుంచి నిర్దేశిత గడువులోపు అందిన ధరఖాస్తులపై మండలాల వారిగా క్షేత్ర స్థాయి పరిశీలన జరిపి అర్హులైన వారి జాబితాలను క్రోడీకరించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అర్హులైన వారికి ఒక్కక్కరికీ 3 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాల పంపిణీకి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలని, ప్రభుత్వ భూమి లేని మండలాల్లో అవసరమైన మేరకు, జర్నలిస్ట్‌లకు అనువైన ప్రయివేట్ భూములను సేకరించాలని సూచించారు. కమిటీలోని జర్నలిస్ట్ సభ్యులు, ఆర్‌డిఒలు, డిఐపిఆర్‌ఒలు సంయుక్తంగా గుర్తించిన భూములను పరిశీలించాలని, యోగ్యమైన భూముల సేకరణకు ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెసి ప్రవీణ్ ఆదిత్య ఇన్‌ఛార్జ్ డిఆర్‌ఓ కె.శ్రీరమణి, జిల్లా సమాచార పౌర సంబంధ అధికారి డి.నాగార్జున, జర్నలిస్ట్ సభ్యులు లక్కింశెట్టి శ్రీనివాసరావు, వాడ్రేవు శ్రీనివాస ప్రసాదరావు, మచ్చా ప్రకాష్ పాల్గొన్నారు.


అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

## పేద ప్రజలందరూ ఐక్యం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఐఎఎస్ విజయకుమార్

ప్రజాశక్తి - కోటనందూరు

సామాజిక, రాజకీయ, ఆర్థిక సమానత్వం కోసం పేద బలహీన వర్గాల ప్రజలందరూ ఐక్యం కావాలని మాజీ ఐఎఎస్ విజయకుమార్ అన్నారు. ఐక్యత నినాదంతో 142 రోజుల సుదీర్ఘ పాద యాత్రలో 2723 కిలోమీటర్ల పాదయాత్ర చేసుకుంటూ143 వరోజు శనివారం ఆయ న తుని చేరుకున్నారు. విజయ్ కుమార్ పాదయాత్రకు నాసా స్వచ్ఛంద సంస్థ ప్రతి నిధులు నూతనపాటి జ్యోతి ప్రేమదాస్, నూతలపాటి సోను హుడ్ కోటనందూరు, తుని, తొండంగి మండలాల భారీ సంఖ్యలో దళితులు, సామాజిక కార్యకర్తలు, దళిత నాయకులు స్వాగతం పలికారు. అనంతరం నాసా స్వచ్ఛంద సంస్థ ఆవరణంలో బహిరంగ సభలో విజయకుమార్ మాట్లాడుతూ పేద ప్రజలు ఆశయాలు నెరవే నెరవేరాలన్నా వారి హక్కులను, కాపాడుకోవాలన్న, అందరూ ఒకే మాట, ఒకే బాటగా మన శక్తిని నిరూపించుకోవాలని పిలుపునిచ్చారు. బానిసత్వం పోయి సమానత్వం సాధించాలని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒబిసి అగ్రవర్ణ పేదల కష్టాలకు విముక్తి కలగాలంటే ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. తొలుతగా నాసా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు దివంగత నూతలపాటి ప్రేమదాసు విగ్రహానికి పూలదండ నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో తుని నియోజకవర్గ దళిత నాయకులు, ప్రజాసంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కార్టూ'నిజం'




## సిద్ధం సభకు తరలిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఏలూరులో సిఎం జగన్మోహన్ రెడ్డి సిద్ధం సభకు శనివారం జిల్లా నుంచి పెద్దఎత్తున వైసిపి శ్రేణులు తరలివెళ్లాయి. **రౌతులపూడి** మండలంలోని పలు గ్రామాల నుంచి ఏలూరు సభకు వైసిపి శ్రేణులు తరలివెళ్లాయి. మండల కేంద్రమైన రౌతులపూడిలో జడ్‌పిటిసి గొల్లు లక్ష్మణమూర్తి, వాసిరెడ్డి జమీలు వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. **శంఖవరం** శంఖవరం మండల వైసిపి అధ్యక్షుడు పర్వత రాజబాబు సారథ్యంలో వివిధ గ్రామాల నుంచి వైసిపి శ్రేణులు ఏలూరు సిద్ధం సభకు తరలివెళ్లారు. **కిర్లంపూడి** కిర్లంపూడిలో వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన వాహనాలకు వైసిపి నాయకుడు దాడి చిన్నబుజ్జి జెండా ఊపి ప్రారంభించారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు సారథ్యంలో వైసిపి శ్రేణులు తరలి వెళ్లాయి. **కాజులూరు** జడ్‌పిటిసి సభ్యులు వనుము వెంకట సుబ్బారావు, ఎంపిపి మాత భారతి ఆధ్వర్యంలో పలు గ్రామాల నుంచి వైసిపి శ్రేణులు బయలుదేరిన బస్సులకు సర్పంచులు జెండా ఊపి ప్రారంభించారు. **జగ్గంపేట రూరల్** స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నియోజక వర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ తోట నరసింహం ఏలూరు సిద్ధం సభకు వెళ్లే వాహనాలకు జెండా ఊపి ప్రారం భించారు. ఈ కార్య క్రమంలో నాయకులు ఒమ్మి రఘు రాం, జాన్ వెస్లీ, తోట రాంజీ, అత్తులూరి సాయిబాబు, పెద్దాడ రాజబాబు, గఫూర్, తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్థానిక చెరువు సెంటర్ వద్ద ఏలూరు సిద్ధం సభకు తరలివెళ్లే వాహనాలకు ఎంపిపి రాయుడు సునీత జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, నాయకులు రాయుడు గంగాధర్, కాదా గోవింద కుమార్, కొప్పిశెట్టి వెంకట్, తదితరులు పాల్గొన్నారు. **కరప** ఎంపిపి పెంకి శ్రీలక్ష్మి, జడ్‌పిటిసి సభ్యులు వై సుబ్బారావు, చింతా ఈశ్వరరావు, బండే పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల నుంచి సిద్ధం సభకు తరలివెళ్లారు.


జగ్గంపేటలో బస్సులను ప్రారంభిస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నరసింహం



కరపలో మేము సిద్ధం అంటున్న వైసిపి శ్రేణులు

## 8న ఆశాల చలో విజయవాడ

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఆశా వర్కర్స్ సమస్యల పరిష్కారానికై ఈ నెల 8న విజయవాడలో జరుగు మహాధర్నాకు తరలిరావాలని ఆశ వర్కర్స్ యూనియన్ తాళ్లరేవు కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. తాళ్లరేవు ప్రజా సంఘాల కార్యాలయంలో యూనియన్ అధ్యక్షురాలు పి.అనంతలక్ష్మి అధ్యక్షతన ఆశ వర్కర్ల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి ఆర్. నాగలక్ష్మి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆశా వర్కర్లపై పని భారం పెంచి, కనీస వేతనాలు పెంచలేదన్నారు. రూ.10 వేలు వేతనం ఇస్తున్నామన్న పేరుతో 24 గంటలు చాకిరీ చేయిస్తున్నారని, ఇతర సిబ్బంది చేయవలసిన పనులను బెదిరించి, వేధించి ఆసాలతో చేయిస్తున్నారన్నారు. వీటి వల్ల విధి నిర్వహణలో నెలకు రూ.3 నుంచి రూ.4 వేలు చేతి డబ్బులు ఖర్చు చేయవలసి వస్తుందని తెలిపారు. ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి విజయవాడలో ఒకరోజు మహాధర్న జరుగుతుందని, ఈ ధర్నాకు ఆశాలందరూ కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీదేవి, అమ్మాజీ, విమల, అనంతలక్ష్మి, శారద, అనంత, నాగమణి, పార్వతి పాల్గొన్నారు.


చలో విజయవాడ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆశాలు

## పేకాట శిబిరంపై దాడి.. ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - కడియం

మురమండ గ్రామ శివారు రహస్య ప్రాంతంలో నిర్వహిస్తున్నపేకాట శిబిరంపై శనివారం తెల్లవారుజామున కడియం సిఐ బి.తులసీధర్, ఎస్ఐ అశ్విక్ తమ సిబ్బందితో జరిపిన దాడుల్లో ముగ్గురిని అరెస్టు చేయగా, మరో ఐదుగురు పరారయ్యారు. ఈ కేసుకు సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్లో సిఐ, ఎస్ఐలు మాట్లాడుతూ ఘటన స్థలంలో ఒక కారు, ఒక ఆటో, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు చరవాణిలు, రూ.5,880లు నగదు స్వాధీన పరచుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా పేకాటరాయుళ్లను తప్పించుకున్న మరో ఐదుగురు పరారీలో ఉన్నారని వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

## 5, 6 తేదీల్లో క్రీడా శిక్షకు ఎంపికలు

ప్రజాశక్తి - యానాం

కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)లో వివిధ క్రీడాంశాల్లో శిక్షణకు ఎంపిక పోటీలను ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సెంటర్ ఇన్‌ఛార్జ్ ఎస్.ఉదయకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ క్రీడాంశాల్లో సెలక్షన్ ట్రైల్స్ జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులకు రెసిడెన్సియల్, నాన్ రెసిడెన్సియల్ స్కీమ్స్ డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియం ఆవరణలోని సాయ్‌లో శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 0884- 2950063, 88851 76888 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## జయహో బిసి సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈనెల 7న టిడిపి కార్యాలయంలో జరిగే జయహో బిసి సభను విజయవంతం చేయాలని మండల బిసి సెల్ అధ్యక్షులు జిత్తుగ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానికంగా శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 17 పంచాయతీల నుంచి బిసిలు, ఉపకులాలకు చెందిన చెందిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో రావాలని కోరారు. ఈ సభ ముమ్మిడివరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ దాట్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ధూళిపూడి వెంకటరమణ, వాడ్రేవు వీరబాబు, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ, వాశంశెట్టి శ్రీనివాసరావు, దున్నా మురళి, చంటి పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచే అవగాహన అవసరం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

వినియోగ దారుల హక్కులపై విద్యార్థి దశ నుంచే అవగాహన అవసరమని ఎంఇఒ వై.శివ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మునిసిపల్ హైస్కూల్‌లో హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ అధ్యక్షతన స్కూల్ విద్యార్థులకు వినియోగ దారుల క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్యాకేజీలు, తయారీ, ఎక్స్‌పైర్ తేదీ, ఎంఆర్‌పి, తూనికలు కొలతలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సర్వతోముఖా భివృద్ధికి ఇటువంటి కార్యక్రమాల ద్వారా దోహదం చేస్తా యన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ విని యోగదారుల ఫోరం కన్వీనర్ బి సూర్యనారాయణ మూర్తి, లీగల్ మెట్రాలజీ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.మోహన్, క్లబ్ కన్వీనర్ జి గోవిందు, వి రాజు, కె.అరుణ, పాల్గొన్నారు.

## దాతృత్వమే యువతకు నిజమైన ఆనందం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అభాగ్యులకు ఆసరాగా నిలుస్తూ వారి జీవితాల్లో నింపుతున్న వెలుగుల్లోనే యువత ఆనందాన్ని చూస్తున్నారని గ్రంథాలయ విశ్రాంతి అధికారి చింతపల్లి సుబ్బారావు అన్నారు. మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాత్కాలిక ఆకర్షణ, ఆనందం కోసం కొందరు యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో శివ శంకర్, బాలు, వెంకీ, బాబి, మణికంఠ, రాజా, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల ద్వారా మానసిక వికాసం

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక వికాసం కూడా సిద్ధిస్తుందని డిఎస్‌పి లతాకుమారి అన్నారు. స్థానిక లూథరన్ హైస్కూల్లో గత రెండు రోజులుగా నిర్వహించిన భాష్యం స్పోర్ట్స్ మీట్ శనివారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం ఆమె విజేతలైన విద్యార్థినిలకు బహుమతులు అందజేశారు. భాష్యం జోనల్ ఇన్‌ఛార్జ్ గోవిందరాజు మాట్లాడుతూ 5 భాష్యం బ్రాంచీలకు చెందిన బాలికలకు కోకో, కబడ్డీ, త్రో బాల్, షటిల్, టెన్నికాయిట్, క్యారమ్స్, చెస్ విభాగాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ కరస్పాండెంట్ జి.నళిని, ప్రిన్సిపల్స్ గోవిందరాజు, చంద్రశేఖర్, వేణు, అనిల్, సూర్యారావు, ప్రైమరీ ప్రిన్సిపల్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో మొండి చేయి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన మధ్యంతర బడ్జెట్‌లో జిల్లాకు పూర్తిగా మొండి చేయి తప్పలేదు. గత నాలుగేళ్లుగా ఊరిస్తూ ఉసూరు మనిపించిన విషయం విదితమే. సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో తాయిలాలు ప్రకటించే అవకాశాలున్నాయని ఎదురు చూసిన వివిధ వర్గాల ప్రజలకు నిరాశే మిగిలింది. రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి పోటీ పడి మద్దతు తెలపడమే ఈ దుస్థితికి కారణమని ప్రజల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికలకు ముందు ప్రతి జిల్లాకు ఒక ఎయిర్ పోర్టు అని వైసిపి అధినేత చెప్పిన విషయం విదితమే. కొత్త ఎయిర్‌పోర్టులు లేకపోగా రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టు అభివృద్ధి ఆదరణలో ఇప్పటికే పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. కేంద్రమంత్రి రైల్వే ప్రాజెక్టుల్లోనూ పురోగతి కరువైంది. పోలవరం ప్రాజెక్టుకు కేటాయింపులపైనా తాత్సారం తప్పలేదు. కాకినాడ పిఠాపురం ప్రధాన రైలు మార్గం అనుసంధానానికి గతంలో కేటాయించిన బడ్జెట్‌కు నామమాత్రపు కేటాయింపులు నప్పిపోయాయి గాక నాకేటి సిగ్గ అన్న చందంగా మారింది. కేవలం వెయ్యి చొప్పున కేటాయించడం విమర్శలకు దారి తీసింది. కోటిపల్లి - నర్సాపురం రైలు మార్గం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ లోపం నిధుల లేమి వెంటాడుతోంది. రాష్ట్రం మీ వల్ల అంటే మీ వల్ల అప్పులు పాలైందని ఇటు అధికార వైసిపి, అటు టిడిపి విమర్శలు చేసుకుంటున్నాయే గాని కేంద్ర ప్రభుత్వం నుంచి రావల్సిన నిధులను సాధించడంలో చిత్తశుద్ధి కరువైంది. కనీసం ప్రజల కోసం అయినా కేంద్ర నిర్ణయాలను వ్యతిరేకించక పోవడం ప్రజలను ఆలోచింపచేస్తోంది.

### టిడిపి, జనసేన ఆశావహుల్లో ఉత్కంఠ

టిడిపి, జనసేన ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. అధికార వైసిపి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలకు చక చకా ఏర్పాట్లు చేయడంతో ప్రతిపక్ష నేతల్లో కలవరం వ్యక్తమవుతోంది. వైసిపి ఇప్పటికే శాసనసభ నియోజకవర్గాలతో పాటు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జిలను ప్రకటించి వారే అభ్యర్థులను చెప్పకనే చెప్పింది. ఐ పాక్ సర్వే ఆధారంగా సిట్టింగ్‌లకు స్థాన చలనం చేసి కొత్త స్థానాల్లో అదృష్టాన్ని పరీక్షించుకోవాలని తేల్చిచెప్పింది. దీంతో అభ్యర్థులు ప్రజల్లోకి వెళ్లి ప్రచారం ప్రారంభించారు. పర్యటనలో తమను గెలిపించాలని విజ్ఞప్తులు చేస్తున్నారు. ఇండియాకూటమి తిరిగి సమన్వయాలను ఆదిపి ఇంకా తెలుసుకోవటంతో పాటు మరో రెండు నెలల్లో ఎన్నికలు ఉన్నప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసి తిరిగి అధికారంలోకి వస్తామంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి జాబితా ఇప్పటికీ విడుదల చేయలేదు. దీంతో అనేక నియోజకవర్గాల్లో ఏ నియోజకవర్గం ఎవరికి కేటాయిస్తారనే గందరగోళం నెలకొంది. టిడిపి జనసేన నేతల అంతర్మథనానికి ఇదీవల రాజానగరం రూరల్ నియోజక వర్గంలో నిర్వహించిన రా కదలిరా సభ వేదికైంది. అధినేత ముందే రాజానగరంలోని టిడిపి, జనసేన నేతలు వాగ్యుద్ధానికి దిగటం విమర్శలకు దారి తీసింది.

### విమర్శలకు దారి తీసిన పరీక్షల వాయిదా

వైసిపి నిర్వహించిన సిద్ధం కార్యక్రమం కోసం ఇంటర్మీడియెట్ పరీక్షను వాయిదా వేయటం విమర్శలకు దారి




తీసింది. ఏలూరులో శనివారం నిర్వహించిన సభకు ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పరీక్షను వాయిదా వేయటంతో పాటు ఆర్‌టిసి బస్సులను సైతం సభకు తరలించారు. దీంతో జిల్లావ్యాప్తంగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి జిల్లాలోని వైసిపి నేతలు తమ తమ నియోజక వర్గాల నుంచి ప్రజలను తరలించి అధినేత ఆశీస్సులు పొందేందుకు పోటీ పడ్డారు. ప్రజల ప్రయాణ అవసరాలను పక్కన పెట్టి ఇబ్బందులకు గురి చేస్తూ నిర్వహించే ఇటువంటి సభలు ఏ మేరకు సహాయపడతాయో వేచి చూడాలి.

### ఓట్ ఫర్ ఒపిఎస్ సభ విజయవంతం

ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం నిర్వహించిన ఓట్ ఫర్ ఓపిఎస్ కార్యక్రమం విజయవంతమైంది. సుమారు 3 వేల మంది వస్తారని అంచనా వేయగా 7 వేలకు పైగా ఉపాధ్యాయులు హాజరవటంతో ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అధికార వైసిపితో పాటు, ప్రతిపక్ష టిడిపి నుంచి ఒపిఎస్‌పై ఎటువంటి హామీ రాలేదు. దీంతో ఉపాధ్యాయులు మరో ఉద్యమానికి సిద్ధం అవుతున్నట్లు ప్రకటించారు.

## బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

యు.కొత్తపల్లి మండల తహశీల్దార్‌గా కె.రాజ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లా మండవల్లి మండలం నుంచి రావడం జరిగిందని, ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

## రైల్వే లైన్ పనులను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కాట్రేనికోన

కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ వేగవంతంగా పూర్తి చేయాలని జిఎంసి.బాలయోగి సాధన సమితి నాయకులు ఉంగరాల వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ ప్రవేశపెట్టిన నూతన రైల్వే బడ్జెట్‌లో కాకినాడ నుంచి కోటిపల్లి వరకు రైల్వేలైన్ మరమ్మత్తులకు రూ.10 కోట్లు, కోటిపల్లి నుంచి నరసాపురం వరకు రూ.300 కోట్లు నిధులు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ పనులను త్వరితగతిన చేపట్టి ప్రజలకు రైల్వే సేవలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో సాధన సమితి నాయకులు నాగిడి నాగేశ్వరరావు, అరిగెల బలరామ మూర్తి, కర్రి రామస్వామి పాల్గొన్నారు.

# టిడిపి, జనసేన ప్రభుత్వం ఖాయం

ప్రజాశక్తి - కోటనందూరు



పార్టీ కండువాలను వేసి ఆహ్వానిస్తున్న రామకృష్ణుడు

రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీల ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. శనివారం మాజీ కౌన్సిలర్ ఎస్‌ఆర్‌వి పృథ్వీరాజు, దంతులూరి వెంకట రమణరాజు, డివివి.అచ్యుత రామ రాజు, బివి.సూర్యనారాయణరాజు, కె.ప్రవీణ్ వర్మ, డి. చైతన్య, దంతులూరి దుర్గా ప్రసాద్, సతీష్ వర్మ, వాడపల్లి సాయిలు టిడిపిలో చేరారు. వీరికి యనమల రామకృష్ణుడు, యనమల కృష్ణుడు టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యనమల రామకృష్ణుడు మీడియాతో మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రజలు చంద్రబాబు నాయుడు పాలన కోరుకుంటున్నారని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన పొత్తుతో అధికారంలోకి వస్తామన్నారు. సంక్షేమ, అభివృద్ధి దిశగా మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన ప్రతి అంశాన్ని 100 శాతం అమలుపరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మోతుకూరి వెంకటేష్, పోలనాటి శేషగిరి, ఇనిగంటి సత్యనారాయణ, దంతులూరి చిరంజీవి రాజు, అంకమరెడ్డి బుల్లిబాబు, యనమల దివ్య, యనమల శివరామకృష్ణ పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలి



ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనం రూ.10 వేలు చొప్పున వేతనాలు పెంచాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఇఒ బి.అబ్బాయికి వారు శనివారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు కోరాడ రాము మాట్లాడుతూ వైఎస్ జగన్ ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా మిడ్డే మీల్స్ కార్మికులకు వేతనాలు పెంచాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఒక్కో విద్యార్థికి రూ.20 చెల్లించాలని, పని భద్రత కల్పించాలని, వంట గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రొంగల ఈశ్వరరావు, అమరావతి, వెంకటలక్ష్మి, ఏసమ్మ, గంగాభవాని, వై సత్యవతి, కే నాగరత్నం, జి అప్పలరాజు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగములో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది. రెండవ రోజు యూనివర్సిటీ అఫ్ పెట్రోనస్, మలేషియాలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఇరైవన్ ఇలమ్ వరుతీ ఆన్‌లైన్‌లో ఇంటిలిజెన్స్ పరిశోధన విభాగంలో మెలకువలని వివరించారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డీన్ అకాడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, విభాగాధిపతి డాక్టర్ ఎ.వానతి, తదితరులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన సత్యప్రభ

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని పలు గ్రామాల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభ పర్యటించారు. రాజవరం గ్రామంలో మాజీ సర్పంచ్ పిట్ల నాగరాజును పరామర్శించారు. అలాగే సర్పంచ్ సోమరౌతు తిరుమల వెంకన్న దొర ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామానికి చెందిన సింగంపల్లి శీను, మన్నే గంగరాజు, పిల్లి ఎలయమ్మ కుటుంబాలను పరామర్శించారు. ఈ పర్యటనలో మండల టిడిపి అధ్యక్షుడు తమరల సత్యనారాయణ, మాజీ ఎంపిపి భాస్కర్ బాబు, టిడిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు పైల సాంబశివరావు, ఏలేశ్వరం ఎంపిపి గంటి మల్ల రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## బిసి హాస్టల్‌ను తనిఖీ చేసిన జిల్లా జడ్జి

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ప్రభుత్వ బిసి బాలికల సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ ను 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్లో నివాసం ఉంటున్న విద్యార్థులను విద్యా ప్రమాణాలు, భోజన ఏర్పాట్లు, హాస్టల్ పరిసరాల స్థితిగతులపై ఆరా తీశారు. విద్యార్థులు చదువు తీరుపై ఉపాధ్యాయులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి కుటుంబ సభ్యులకు పేరు ప్రఖ్యాతలు వచ్చే విధంగా మెలగాలని సూచించారు. విద్యార్థులు తినే అన్నం, కూర పరిశీలించారు. హాస్టల్ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని హాస్టల్ వార్డెన్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఎస్.కె అబ్బార్ష, హాస్టల్ వార్డెన్ లతా మోహన్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - యంత్రాంగం



కాకినాడ ఆదిత్య కళాశాలలో అతిథిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు జరిగాయి. **కాకినాడ** యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని మెడికవర్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పృథ్వీరాజ్ అన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం, జీవశాస్త్ర విభాగం, కాకినాడ మెడికవర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. క్యాంపస్ ఇన్‌ఛార్జ్ ఎన్.మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యవంతమైన యువత వలన ఆరోగ్యభారత నిర్మాణం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ మరియు పీజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ ఎన్.మూర్తి మాట్లాడారు. బయోసైన్స్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ఆహ్వానితులు తిలకించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, ఎల్.దివాకరరావు, జీవశాస్త్ర శాఖధిపతి డాక్టర్ బి.శ్రీను, వి అనిల్, డి.మాధవి రత్నప్రియ, శ్రీనిహారిక, హర్షిత, కెజిఎల్.సుభాషిని తదతరులు పాల్గొన్నారు. **గండేపల్లి** సూరంపాలెం ఆదిత్య కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా కాకినాడ మెడికోవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డోలా సంజయ్, డీన్‌లు డాక్టర్ ఎ.రామకృష్ణ, డాక్టర్ సిహెచ్.రాఘవేంద్రన్, ఎన్ఎస్ఎస్ పిఒ చిట్టూరి రాంప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు. **కాకినాడరూరల్** స్థానిక మెడికవర్ హస్పటల్‌లో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి అనగానే ముందు మనం భయపడటం సహజం, కానీ సరైన సమయంలో మనం చికిత్స అందిస్తే మనం వారికీ పునర్జన్మని అందించినవాళ్ళం అవుతామని అన్నారు.

## శృంగార వల్లభ స్వామికి రూ.3.02 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం



భోజనాలు చేస్తున్న యాత్రికులు

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ.1,88,570, అన్నదాన విరాళాల ద్వారా రూ.62,285, కేశఖండన ద్వారా రూ.2,800 ఆదాయం సమకూరిందని ఆలయ కార్య నిర్వహణాధికారి పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ధర్మకర్తలు, అర్చకులు పెద్దింటి నారాయణచార్యులు, పురుషోత్తమాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, రమేష్, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్, గ్రామస్తులు సేవలందించారు.

## ధర్మకర్తల నియామకం కోసం దరఖాస్తులు చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రాణి వత్సవాయి బుచ్చి సీతయ్యమ్మ సత్రం ధర్మకర్తల నియామకం కోసం ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోవచ్చని సత్రం కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 20 రోజులలోగా ఆసక్తి కలవారు పేర్కొనబడిన నియమ నిబంధనలతో నమూనా ఫారం- 2 ద్వారా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ కాకినాడ వారికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## మేకపై జంతువు దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం



దాడిలో మృతి చెందిన మేక

మండలంలోని కాండ్రకోట గ్రామంలో శనివారం తెల్లవారుజాము ప్రాంతంలో మేకపై గుర్తు తెలియని జంతువు దాడి చేసి సగం కళేబరాన్ని వదిలేసి వెళ్ళిపోయింది. ఇప్పటికే గ్రామంలో క్షుద్ర పూజలు జరుగుతున్నాయని ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకున్న సమయంలో సగం మేక కళేబరం కనబడటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. గ్రామంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సమీపంలో నివసించే షేక్ భాషాకు చెందిన మేకపై గుర్తుతెలియని జంతువు దాడి చేసి సగం మాంసాన్ని తినేసి మేక కళేబరాన్ని వదిలేసి వెళ్ళిపోయింది. ఉదయం గ్రామస్తులు ఈ దృశ్యాన్ని చూసి భయాందోళనకు గురయ్యారు. ఇది జంతువు పనేనా? ఎవరైనా వ్యక్తులు కావాలనే ఇలా చేస్తున్నారా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

## కరప తహశీల్దార్‌గా రామకోటేశ్వరరావు

ప్రజాశక్తి - కరప

మండల తహశీల్దార్‌గా వాసిరెడ్డి రామకోటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా కృతివెన్ను మండలం నుంచి రామకోటేశ్వరరావు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న పరిస్థితులపై అవగాహన తెచ్చుకుని, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను అందిస్తానని తెలిపారు. జిల్లాకు చెందిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సూచనలు సలహాలతోపాటు, స్థానికంగా ఉండే అధికారుల సహకారంతో ముందుకు సాగుతానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.



## నవోదయను సందర్శించిన న్యాయమూర్తి

ప్రజాశక్తి - పెద్దాపురం:

స్థానిక నవోదయ విద్యాలయాన్ని శనివారం తూర్పుగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె ప్రత్యూష కుమారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు అందజేస్తున్న సదుపాయాలు, శిక్షణా ప్రణాళిక తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందజేస్తున్న ఆహారాన్ని రుచి చూశారు.



## దేనికైనా మేము సిద్ధం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నెహ్రూ

ఎన్నికల సమయంలో ఏరకంగా సిద్ధమై వచ్చినా దానికి ఎదుర్కొని తిప్పి కొట్ట డానికి తాము సిద్ధమని టిడిపి రాష్ట్ర ఉపాధ్య క్షుడు, మాజీ ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న సంపదను దోచుకోవడానికి సిద్ధమా, మూడు రాజధానులు పేరుతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసినందుకు సిద్ధమా, మద్యం ద్వారా తాడేపల్లి ప్యాలస్‌కి ధన ప్రవాహం చేస్తున్నావని సిద్ధమా, ఎదురు తిరుగుతున్న అనేకమంది ప్రజాస్వామ్యవాదులను ఇబ్బందులు గురి చేస్తున్నందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల సమయంలో ఏ రకంగా వచ్చినా ఎదుర్కోవడానికి, తిప్పకొట్టడానికి మేము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎన్నికలు హామీలను 95 శాతం నేరార్చమని గొప్పగా చెప్పుకుంటున్నారని, సంపూర్ణ మద్యపాన నిషేధం చేశారా, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం చేశారా, ప్రత్యేక హోదా సాధించారా అని ప్రశ్నించారు. 25 ఎంపి సీట్లు ఇస్తే ప్రత్యేక హోదా సాధిస్తాం అని ఆనాడు అన్నారని ఎంపిలను ఇచ్చినా ప్రత్యేక హోదా సాధించలేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, కొత్త కొండబాబు, జీను, మణిబాబు, దాపర్తి సీతారామయ్య, పి టి ప్రసాద్ పాల్గొన్నారు.